5 తరగతులు.. 2 గదులు

● అరకొర వసతులతో విద్యార్థుల అవస్థలు ● అభివృద్ధికి నోచని శాంతినగర్ పాఠశాల


చందానగర్ పరిధి శాంతినగర్‌లోని ప్రాథమిక పాఠశాల


తరగతి గదులు

చందానగర్ : ఐటీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న చందానగర్‌లోని శాంతినగర్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి నోచుకోలేదు. పాఠశాలలో కనీస వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో నివసించే పేదల పిల్లలు ఎక్కువగా ఈ పాఠశాలకు వస్తుంటారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 60 మంది విద్యార్థులు ఉన్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు అవసరం కాగా ఇద్దరే ఉన్నారు. ఒక తరగతి గదిలో మూడు తరగతుల విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులకు పాఠశాల సమస్యలపై విన్నవించినా పట్టించుకోవడం లేదని పాఠశాలను అభివృద్ధి చేయాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలకు కొత్త భవనాన్ని నిర్మించడంతో బాటు విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఉపాధ్యాయులను కేటాయించాలని కోరుతున్నారు.

సమస్యలు ఇవే..

- పాఠశాల శిథిలావస్థకు చేరింది. స్కూలు ముందు వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి.
- 5 తరగతులు ఉండగా విద్యార్థులు రెండు గదులలో కూర్చుంటున్నారు
- ఆడుకోవడానికి స్థలం లేదు. మరుగుదొడ్లు లేక ఇబ్బందిపడుతున్నారు.
- ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు రెండు గదులు ఉండగా, అంగన్‌వాడీకి మూడు గదులు ఉన్నాయి.
- పాఠశాల ఎదుట ఇష్టానుసారంగా వాహనాలు నిలుపుతున్నారు.
- సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇరుకు గదుల్లో బోధన



శాంతినగర్ ప్రభుత్వ పాఠశాల విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు ఇరుకు గదులలోనే పాఠాలు చెబుతున్నారు. ఐదు తరగతుల విద్యార్థులను రెండు గదుల్లో కూర్చోబెడుతున్నారు.

– పవన్, శాంతినగర్

అరకొర వసతులు



పాఠశాలలో విద్యార్థులకు కావలసిన కనీస వసతులు కరువయ్యాయి. మరుగుదొడ్లు లేకపోతే దాతల సహాయంతో మరుగుదొడ్లు నిర్మించారు. ఇప్పటికైనా అదనపు గదులు నిర్మించాలి.

–సాయి, శాంతినగర్


పాఠశాల ముందు వ్యర్థాలు, మట్టి కుప్ప


స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్మిస్తున్న మరుగుదొడ్లు

చెట్టుకొమ్మలు తొలగించండి



చందానగర్: చందానగర్ మంజీరారోడ్డులో చెట్టు కొమ్మలు రోడ్డుపైకి వచ్చాయి. నీడనిస్తున్నా రాత్రి సమయాలలో ప్రమాదాలు జరుగుతున్నాయి. చెట్టు కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

గణేషుడికి గరిక అలంకారం



రాయదుర్గం: సంకష్టహర చవితిని పురస్కరించుకొని శుక్రవారం గచ్చిబౌలిలోని శివసాయి క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేషుడికి గరికతో అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే అన్నపూర్ణాదేవి, కాశీ విశ్వేశ్వరస్వామి, షిర్డీ సాయిబాబా, ఆంజనేయస్వామి, ఇతర దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

ప్రత్యేక పూజలు

రాయదుర్గం: జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంకష్టహర చవితిని పురస్కరించుకొని ఆలయంలో అమ్మవారికి నిమ్మకాయల దండ వేశారు. గణేషుడు, షిర్డీ సాయిబాబా, చంద్రమౌళీశ్వర స్వామి, ఆంజనేయస్వామికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

పెగా ఇన్ఫినిటీ -25తో పనితీరు మెరుగు

మాదాపూర్: పెగా పరిశ్రమలో మొదటిసారిగా కృత్రిమ మేధ ఏజెంట్లతో ఎంటర్‌ప్రైజ్ పనితీరును ఆధునీకరించే లక్ష్యంతో పెగా ఇన్ఫినిటీ– 25ను శుక్రవారం మాదాపూర్ మైండ్‌స్పేస్‌లో విడుదల చేసింది. పెగా ఏజెంటిక్ ప్లాట్‌ఫార్మ్ పాత సిస్టమ్స్‌ను ఆధునీకరించడంలో సహాయపడుతుంది. కృత్రిమ మేధ ఏజెంట్లతో ఆటోమెషిన్ సాధించేందుకు సహకరిస్తాయి.

రోడ్డు, ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

మియాపూర్: మదీనాగూడ దీప్తీశ్రీనగర్ కాలనీ ప్రధానరోడ్డులో ఫుట్‌పాత్, రోడ్డు ఆక్రమణలను మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం తొలగించారు. మియాపూర్ ట్రాఫిక్ సీఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో పోలీసులు తోపుడు బండ్లు, యాడ్స్ బోర్డులను తొలగించి వేశారు. రోడ్డును ఆక్రమించిన పార్కింగ్‌లను కూడా తొలగించారు. ఈ సందర్భంగా సీఐ ప్రశాంత్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా ఫుట్‌పాత్, రోడ్డు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి

మియాపూర్: అభివృద్ధి పనులను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తిచేయాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని పటేల్ చెరువు నుండి గంగారం పెద్ద చెరువు వరకు నూతనంగా చేపడుతున్న వరదనీటి కాల్వ పనులను ఎస్ఎన్‌డీపీ అధికారులు, చందానగర్ డివిజన్ సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ డీఈ ధీరజ్, నాయకులు సందీప్ రెడ్డి, రాహుల్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో శనివారం ఉచిత వైద్య శిబిరం, మెనోపాజ్ శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సీఈఓ యోబు ఓ ప్రకటనలో తెలిపారు. నేషన్స్ బెనిఫిట్స్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో గైనకాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్, యోగా థెరపిస్ట్, ఫిజియో థెరపిస్ట్, ఆర్థోపెడీషియన్, కార్డియాలజిస్ట్ నిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ శిబిరంలో సీబీపీ, సీఏయూ, ఛాతి ఎక్స్‌రే, ఈసీజీ, 2డీ ఏకో, అల్ట్రాసౌండ్, విటమిన్ బీ 12, డీ, డయాబెటిక్, న్యూరోపతి ఎసెస్‌మెంట్ తదితర పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు.

నేడు జాబ్ మేళా

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్ట కొండపై ఉన్న కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

12 నుంచి 14 వరకు పల్స్‌పోలియో

పటాన్‌చెరు టౌన్: పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగంగా పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈనెల 12 నుంచి 14వరకు చుక్కల మందు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 12న అన్ని ప్రభుత్వ, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సహా వాటి పరిధిలోని బూత్‌లలో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు చిన్నారులకు చుక్కల మందు వేయనున్నారు. 13, 14 వ తేదీల్లో ఇంటింటి పంపిణీ నిర్వహించనున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని యూపీహెచ్‌సీ పటాన్‌చెరు మెడికల్ ఆఫీసర్ నేత్రావతి తెలిపారు. పటాన్‌చెరు పరిధిలోని 6,602 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. మొత్తం 24 బూత్‌లలో ఒక్కో కేంద్రంలో నలుగురు చొప్పున సిబ్బందిని నియమించారు. ఇందులో ఆరోగ్య సిబ్బందితో పాటు నర్సింగ్, డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు పాల్గొని సేవలందించనున్నారు.

స్పెషల్ డ్రైవ్ : 12 ఆటోలు సీజ్


తనిఖీల్లో పాల్గొన్న ఆర్టీఏ, మియాపూర్ పోలీసులు

మియాపూర్ : మియాపూర్ ఆల్విన్ ఎక్స్ రోడ్డులో కొండాపూర్ ఆర్టీఏ అధికారులు, మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించి సరైన పర్మిట్, పత్రాలు లేని 12 ఆటోలను సీజ్ చేశారు. కొండాపూర్ ఆర్టీఏ ఏఎంవీఐ మనోజ్, మియాపూర్ ట్రాఫిక్ సీఐ ప్రశాంత్, పోలీస్ సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆటోల తనిఖీలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించి సరైనా పత్రాలు లేకుండా నడుపుతున్న 12 ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించరాదని, ప్రధాన రహదారుల వెంబడి ఫ్రీలెఫ్ట్‌లో ఆటోలు ఆపడం, యూటర్న్ వద్ద అడ్డదారిగా వెళ్లి నేరుగా వచ్చే వాహనదారులకు ఇబ్బందులు కల్గించరాదని సూచించారు.

బీరంగూడ- కిష్టారెడ్డిపేట రహదారి జంక్షన్ల అభివృద్ధి


అధికారులతో కలిసి కూడలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బీరంగూడ నుండి కిష్టారెడ్డిపేట ఔటర్‌రింగ్ రోడ్డు వరకు 68 కోట్ల రూపాయలతో చేపట్టిన 100 ఫీట్ల రహదారి విస్తరణలో భాగంగా మండే మార్కెట్ జంక్షన్, గ్రీన్ ఫీల్డ్ జంక్షన్, పటేల్‌గూడ డబుల్ బెడ్‌రూమ్ జంక్షన్‌లను కోటి 50 లక్షల రూపాయలతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రెవెన్యూ, మున్సిపల్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్ మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి కూడళ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బీరంగూడ-కిష్టారెడ్డిపేట రహదారి పరిధిలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా 100 ఫీట్ల రహదారిగా విస్తరించడం జరిగిందని తెలిపారు. రహదారి పరిధిలోని మండే మార్కెట్, గ్రీన్ ఫీల్డ్ జంక్షన్, పటేల్‌గూడ డబుల్ బెడ్‌రూమ్ జంక్షన్‌ల అభివృద్ధికి ఒక కోటి 50 లక్షల రూపాయల నిధులు కేటాయించినట్లు తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ జంక్షన్‌లో శివాజీ విగ్రహం, పటేల్‌గూడ డబుల్ బెడ్ రూమ్ జంక్షన్‌లో మహాత్మా గాంధీ విగ్రహాలను సొంత నిధులతో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. త్వరలో ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహాగౌడ్, తహసీల్దార్ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, ట్రాఫిక్ సీఐ లాలూనాయక్, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం డీఈ వెంకటరమణ, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన 'ఇబ్టిడా-2025'


విజేతలకు మెమెంటో ఇస్తున్న ఈడీ తేజ్‌లోహిత్‌రెడ్డి

రాయదుర్గం: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడానికే 'ఇబ్టిడా' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్‌లోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ క్యాంపస్‌లో ఇంటర్ కాలేజ్ ఫెస్ట్ 'ఇబ్టిడా-2025' పేరిట నిర్వహించిన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లను అందించారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చందానగర్ : తారానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటనారాయణరెడ్డి పేర్కొన్నారు.

- లింగంపల్లి ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 నుంచి 11.30 గంటల వరకు లింగంపల్లి, కూరగాయాల మార్కెట్ ఏరియాలో..
- పాపిరెడ్డి నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 01.00 గంటల వరకు పాపిరెడ్డి కాలనీ ఏరియాలలో..
- హుడా కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 05.00 గంటల వరకు హుడా కాలనీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

కొండాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ..

గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రంగారెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రెస్టీజ్ అపార్ట్‌మెంట్, జయభేరి, రాజరాజేశ్వరినగర్, రాఘవేంద్రకాలనీ, 8వ బెటాలియన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

హాఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో..

- హాఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.
- మార్కెట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 నుంచి 11.00 గంటల వరకు శిల్పా గార్డెన్ , సీఎం తోట రోడ్డు, ప్రేమ్‌నగర్ బి బ్లాక్, హనీఫ్ కాలనీ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.
- ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 నుంచి 11.00 గంటల వరకు ప్రేమ్‌నగర్, న్యూ హాఫీజ్‌పేట్ ఏరియాలలో..
- గణేష్ టెంపుల్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 నుంచి 11.00 గంటల వరకు మార్తాండనగర్, గణేష్ టెంపుల్ ప్రాంతాలలో..
- హాఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 నుంచి 11.00 గంటల వరకు ప్రకాష్‌నగర్, వినాయక నగర్ ఏరియాలలో..
- ఆల్విన్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు మదీనాగూడ మెయిన్ రోడ్డు, మైత్రీనగర్ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నిర్వహించిన డ్రైవ్‌లో ఏడుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


రాయదుర్గం నాగార్జున ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాయదుర్గం: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో బాటు ఇతరులకు అవగాహన కల్పించాలని రాయదుర్గం ట్రాఫిక్ పోలీసులు సూచించారు. రాయదుర్గం ట్రాఫిక్ ఆర్ఎస్ఐ సత్యనారాయణ, ఏఎస్ఐ ఉస్మాన్ శుక్రవారం రాయదుర్గం నాగార్జున ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సిగ్నల్ ప్రాముఖ్యతను వివరించారు. పాదచారుల దాటే మార్గాలు, ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ పొందే విధానంపై అవగాహన కల్పించారు. రాయదుర్గం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని విద్యాసంస్థలలో అవగాహన కార్యక్రమాలను దశలవారీగా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో రాయదుర్గం పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ


విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తున్న రాజుశెట్టి తదితరులు

శేరిలింగంపల్లి: విద్యార్థులు ఇష్టపడి చదివితే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని బీజేపీ సీనియర్ నాయకులు రాజుశెట్టి సూచించారు. శేరిలింగంపల్లి సురభికాలనీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆయన జన్మదినం సందర్భంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా రాజుశెట్టి మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు చదవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు భీమని కిషోర్, సీనియర్ నాయకులు రమేష్, కౌసల్య, సిద్దు, బాలరాజు, శ్రీకాంత్, మీనా, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు పరిశీలన


మల్కంచెరువు వద్ద రోడ్డును పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ, సైబరాబాద్ ట్రాఫిక్ అధికారులు

గచ్చిబౌలి: ట్రాఫిక్ సమస్యలపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సైబరాబాద్ జాయింట్ సీపీ గజరావు భూపాల్ ,డీసీపీ, ఏడీసీపీ, ఏసీపీ, జీహెచ్ఎంసీ వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ బోర్ఖడే హేమంత్ సహదేవ్‌రావు ,ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన రోడ్లు, వాటర్‌లాగింగ్ పాయింట్లు, కూడళ్ళు, రోడ్ల విస్తరణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

జీహెచ్ఎంసీ, సైబరాబాద్ ట్రాఫిక్ అధికారులు రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఖాజాగూడ జంక్షన్, రాయదుర్గం, మల్కంచెరువు పరిసరాలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని, ఖాజాగూడ జంక్షన్ విస్తరణ చేస్తే మేలు చేకూరుతుందని, వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతాయని వెంటనే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సమాజ పురోగతికి ఐక్యత అవసరం

రాయదుర్గం: సమాజ పురోగతికి మేథోపరమైన, నైతిక ఐక్యత అవసరమని ప్రఖ్యాత శాస్త్రవేత్త, చరిత్రకారుడు ప్రొఫెసర్ రామ్‌పునియాని పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇస్లామిక్ అధ్యయన విభాగం, హెన్రీ మార్టిన్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్‌తో కలిసి 'శాంతి, సామరస్యం: ఒక మతపరమైన దృక్పథం' అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సమావేశం ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. మతపరమైన, సామాజిక భేదాలు ఉన్నప్పటికీ అందరి మధ్య ఐక్యత ఎంతో అవసరమన్నారు. ఆలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయంలోని ఇస్లామిక్ అధ్యయన విభాగం చైర్మన్ ప్రొఫెసర్ ఒబైదుల్లా ఫహద్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచ సవాళ్ళను దృష్టి లో పెట్టుకొని ఈ సూత్రాలను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ. ఇష్తియాక్ అహ్మద్, మనూ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొ. మహ్మద్, ఇస్లామిక్ స్టడీస్ విభాగాధిపతి ప్రొ. మహ్మద్ హబీబ్, డాక్టర్ మహ్మద్ సిరాజుద్దీన్, డాక్టర్ అతీఫ్ ఇమ్రాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి సమష్టి కృషి అవసరం


సభ్యులకు నియామక పత్రాలను అందిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: బీజేపీ బలోపేతం అయ్యేలా మోర్చాలు, కమిటీలు సమష్టిగా కృషిచేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మసీదుబండలోని బీజేపీ కార్యాలయంలో శేరిలింగంపల్లి డివిజన్ నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్ కమిటీ పరిధిలోని 600 మందిని నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలలో బీజేపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కిషోర్ ముదిరాజ్, ఎల్లేష్, రాజుశెట్టి, విజయలక్ష్మీ, మాధవి, నాగమణి, వరలక్ష్మీ, సత్యవాణి, మహేష్, అజయ్, వికాస్ పాల్గొన్నారు.

హాఫీజ్‌పేట్ పీహెచ్‌సీ తనిఖీ

చందానగర్ : హాఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ లలితాదేవి శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 12వ తేదిన నిర్వహించే పల్స్ పోలియో ఇమ్యునైజేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని, రక్త పరీక్షలు కూడా ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. డాక్టర్ రాకేష్, వైద్యాధికారిణి డాక్టర్ అనూష, సీహెచ్‌ఓ సునీత, ల్యాబ్ టెక్నీషియన్లు పండరిరెడ్డి, పద్మ, అధికారి బ్యూలా, నర్సింగ్, ఫార్మసిస్ట్ మమత, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శిక్షణ ద్వారా ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

రాయదుర్గం: నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రెనింగ్ అనేది ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ రంగాలకు చెందిన విభిన్న పారిశ్రామిక వృత్తులలో శిక్షణ, మార్గదర్శక సలహాలను అందిస్తుందని నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రెనింగ్ డైరెక్టర్ డాక్టర్ సుహాస్ దేశముఖ్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో గ్రౌండ్ వాటర్ రీచార్జ్ టెక్నిక్స్ అండ్ మేనేజ్‌మెంట్ శిక్షణా తరగతుల ముగింపు సమావేశాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ రంగంలో శిక్షణ ఇవ్వడం ద్వారా దేశంలోని లక్షలాది మంది పేద మధ్య తరగతి కుటుంబాలు ఈ వృత్తులపైనే ఆధారపడుతూ జీవిస్తున్నారన్నారు. శిక్షణ అనే పదానికి చివర ఉండదని శిక్షణ ద్వారా ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వర్‌రావు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ మిషన్ ఫర్ వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ కింద మధ్యప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న ఈ శిక్షణను ఎస్కీ విజయవంతం చేసిందన్నారు. కార్యక్రమంలో ఎస్కీ వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ ఫ్యాకల్టీ జి నరేష్, రిసోర్స్ పర్సన్ బివిరావు, సాయికిషోర్, ఆఫీస్ ఇన్‌చార్జ్ ఎం కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

చందానగర్ : ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని యూనిసెంట్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మనోజాగృతి సంస్థ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. డాక్టర్ గీత చల్లా నాయకత్వంలో ఇంటర్నేషనల్ స్కూల్‌లో 101 మంది శిక్షణ పొందిన పీర్ కౌన్సిలర్లు, 101 మంది ప్రొఫెషనల్ కౌన్సిలర్ల పర్యవేక్షణలో 101 మంది విద్యార్థులకు మానసిక సమస్యలపై ప్రథమ చికిత్స అందించారు. అనంతరం డాక్టర్ గీత మాట్లాడుతూ మన దేశంలో పీర్ కౌన్సిలర్లు, సైకలాజికల్ ఫస్ట్ ఎయిడ్ యొక్క అవశ్యకత ఉందన్నారు. వరల్డ్ రికార్డ్ యూనియన్ అధికారిక రికార్డు అధకిఆరి షరీఫా హనీఫ్, డాక్టర్ ఆశా, యూనిసెంట్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ కోసూరు సునీల్ కుమార్, ప్రిన్సిపల్ కామేశ్వరి, డాక్టర్ వెంకటసుబ్బయ్య చెన్నంశెట్టి, రాధిక, డాక్టర్ మమత రఘువీర్ ఆచంట, ప్రముఖులు, మనోజగృతి సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.